క్లుప్తంగా

భూ సేకరణ రద్దు చేయాలి



సమావేశమైన మొండిగౌరెల్లి రైతులు

యాచారం: మండలంలోని మొండిగౌరెల్లి గ్రామంలోని 822 ఎకరాల అసైన్డ్, పట్టా భూముల సేకరణకు వేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలోని బాధిత రైతులు శనివారం రాత్రి బొడ్రాయి వద్ద సమావేశమయ్యారు. భూసేకరణకు వేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. శాంతియుతంగా నిర్వహించే ఈ పోరాటంలో గ్రామస్తులమంతా ఐక్యంగా ఉంటామన్నారు. ప్రాణాలైన ఇస్తాం కాని భూములిచ్చేది లేదని తీర్మానం చేసుకున్నారు.

వైభవంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

యాచారం: మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. పూజారులు హరిబాబు, రాజేష్‌ల ఆధ్వర్యంలో దేవాలయం ఎదుట రథోత్సవానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు రథాన్ని పోటీపడి లాగారు. మండల కేంద్రంలోని వీధుల గుండా రథోత్సవం కనులపండువగా సాగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

టీజీడీడీసీఎఫ్ చైర్మన్‌ను కలిసిన నేతలు



అమిత్‌రెడ్డితో చర్చిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ అమిత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలతో పాటు, సమస్యలపై చర్చించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందించి, మరింతంగా ప్రోత్సహించాలన్నారు. సకాలంలో బిల్లులు అందేలా చూడాలని కోరినట్లు వారు తెలిపారు. పాడిపరిశ్రమాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్‌రెడ్డి తెలిపినట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం ఖానాపూర్ ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గార్లపాటి సరిత శనివారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు సరిత భౌతికకాయంపై ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశ్ తదితరులు పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు.

పాఠశాలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడానికి భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కందుకూరు: కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడానికి రూ.8లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గుండ్ర సుధాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు సొడపు వెంకటేశ్‌గౌడ్, స్థానిక నాయకులు గాదె కుమార్ ఆదివారం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అనిల్, శ్రీశైలం, నర్సింహ, కృష్ణ, శ్రీను, జగదీశ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. నిర్వహణ లోపం

- ఖాళీ ప్రదేశాల్లో యథేచ్ఛగా పడేస్తున్న వ్యర్థ పదార్థాలు
- ఇంటింటికీ రాని చెత్త సేకరణ వాహనాలు
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం



జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల పక్కన పేరుకుపోయిన చెత్తచెదారం

ఇబ్రహీంపట్నం: పరిసరాల శుభ్రతతో అందరి ఆరోగ్యం బాగుంటుందనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. అంతటి ప్రాముఖ్యం ఉన్న కార్యక్రమం మున్సిపాలిటీలో సరిగ్గా అమలు కావడం లేదు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులున్నాయి. పది చిన్న వాహనాలు, 5 ట్రాక్టర్లతో నిత్యం డంపు యార్డుకు చెత్తను సేకరించి తరలిస్తున్నారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా వేసేందుకు రెండు బాక్స్‌లను ఇంటింటికి గతంలో అందజేశారు. రోజు విడిచి రోజు చెత్తను తీసుకెళుతున్నట్లు మున్సిపాలిటీ సిబ్బంది చెబుతున్నా అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయి. మూడునాలుగు రోజులకు ఒక్కసారి చెత్తను తీసుకెళ్లే వాహనాలు వస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఖాళీ ప్రదేశం ఉంటే అంతే!

కొత్త కాలనీల్లో నివాసముండే ప్రజలు చెత్తచెదారాన్ని, వ్యర్థ పదార్థాలను అక్కడి ఖాళీ ప్రదేశాల్లో వేస్తుండటంతో కంపు కొడుతున్నాయి. మంచాల రోడ్డులోని పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద, ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పక్కన ఇష్టానుసారంగా చెత్త, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థపదార్థాలను పడేస్తున్నారు. చిన్న కాలువ మాదిరిగా తవ్వి ఉండటంతో చెత్తకు నిలయంగా మారింది. దీంతో దోమలు, పందుల బెడద తీవ్రమైంది. ఆకు కూరగాయల విక్రయం అక్కడ జరుగుతుండడంతో మరింత ఇబ్బందిగా మారింది. వ్యర్థ పదార్థాలను పడేసే ప్రదేశం పక్కనే ప్రభుత్వ పాఠశాల, హాస్టల్స్ ఉన్నాయి. వందలాది విద్యార్థులు నిత్యం దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో ఉన్న కృష్ణ జలాల పైపులైన్ రోడ్డు పక్కల వ్యర్థపదార్థాలను పడేస్తుండటంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తుంది.



బృందావన్ కాలనీలో ఖాళీ ప్రదేశంలో పడేసిన ప్లాస్టిక్ కవర్లు

మున్సిపాలిటీ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

దుర్వాసనతో ఇబ్బంది



సుమారు 400 మంది విద్యార్థులు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల పక్కనే చెత్త చెదారం పడేస్తుండంతో తీవ్ర దుర్వాసన వెలువడుతోంది. దోమలు, పందుల బెడద తీవ్రమైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

– లావణ్య, ప్రధానోపాధ్యాయురాలు, జెడ్పీహెచ్ఎస్, ఇబ్రహీంపట్నం

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం



పారిశుద్ధ్య నిర్వహణపై మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ కళాశాల హాస్టల్, ఉన్నత పాఠశాలల పక్కనే చెత్తను పడేస్తున్నా ఏలాంటి చర్యలు తీసుకోవడంలేదు. ఇదే పరిస్థితి కొత్త కాలనీల్లో కూడా ఉంది. చెత్తసేకరణ వాహనాలు సక్రమంగా రావడంలేదు.

– మంద సుధాకర్, మాజీ కౌన్సిలర్

చర్యలు తీసుకుంటాం



ఇంటింటికి వచ్చే వాహనాల్లో తడిపొడి చెత్తను వేర్వేరుగా తమ సిబ్బంది తీసుకొని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. సిబ్బంది కొరతతో కొంత ఇబ్బంది ఉంది. ఖాళీ ప్రదేశాలల్లో చెత్తచెదారాన్ని పడేస్తే జరిమానా వేస్తున్నాం. ప్లాస్టిక్ కవర్స్ ఉపయోగించకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రణవ్, పర్యావరణ ఇంజనీర్, మున్సిపాలిటీ

నియామకం



నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

ఆమనగల్లు: బీసీ సంక్షేమ సంఘం తలకొండపల్లి మండలం అధ్యక్షుడిగా పడకల్ గ్రామానికి చెందిన గుజ్జరి రాఘవేందర్‌ను నియమించారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో తలకొండపల్లి కార్యవర్గాన్ని నియమించి పత్రాలు అందించారు. బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహగౌడ్, అధికార ప్రతినిధిగా రవీందర్‌యాదవ్, ప్రచార కార్యదర్శులుగా నరేశ్‌ముదిరాజ్, స్వామిగౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కుమార్ యాదవ్‌లను నియమించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెర్కు మణికంఠ, నాయకులు రాజు, నిర్మల, శ్రీశైలంగౌడ్, శంకర్, కుమార్, రవి, మల్లేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు

ఎమ్మెల్యే సబితారెడ్డి



ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

మహేశ్వరం: త్వరలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక ఆ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందగా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. భవిష్యత్తు అంతా బీఆర్ఎస్‌దేనన్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో పాలమూరి నర్సింహ, చిట్టి రాజు, జే.రాజు, విజయ్ పలువురు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మగళ్ల చంద్రయ్య, సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, చంద్రశేఖర్, బండ నర్సింహ, బియ్యం బాబు, తడకల యాదయ్య, కృష్ణ పలువురు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని వినతి

మహేశ్వరం: మహేశ్వరం, కందుకూరు మండలాలను పూర్తిగా ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని అసెంబ్లీలో లేవనెత్తానని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం మండల ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు మీర్‌పేట్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల ఆంక్షల మేరకు తాను పనిచేస్తానని తెలిపారు. మహేశ్వరం, కందుకూరు మండలాలను పూర్తిస్థాయిలో ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని తాను ఇటీవల అసెంబ్లీ సమావేశంలో మాట్లాడనని తెలిపారు. మండలంలోని కొన్ని గ్రామాలను విలీనం చేసి కొన్నింటిని చేయకపోవడం సరైంది కాదని తప్పుబట్టానని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేవరకు జేఏసీ సభ్యులతో కలిసి పోరాడుతానని తెలిపారు. మీ అభిప్రాయమే నా అభిప్రాయమని మీరు చేస్తున్న ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్, ప్రధాన కార్యదర్శి వర్కల యాదగిరిగౌడ్, గౌరవ సలహాదారులు మల్లేశ్ యాదవ్, సుదర్శన్‌రెడ్డి, హన్మగళ్ల చంద్రయ్య, కర్రోళ్ల చంద్రయ్య, కరుణాకర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, యాదిశ్, మాధవచారి, నవీన్, సుధీర్‌గౌడ్, సుదర్శన్‌యాదవ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒక్కచోట కలుసుకున్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంనిర్వహించారు. 25 ఏళ్ల అనంతరం ఒకరినొకరు కలుసుకోవడంతో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యను బోధించిన గురువులు పొగాకు సురేష్, కొప్పు జంగయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, స్వరూపరాణిలను శాలువ కప్పి సన్మానించారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: సీసీ కెమెరాలు కనిపించని మరో నిఘా నేత్రాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ నవయుగ కాలనీలో కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విచ్చేసి ప్రారంభించారు. నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

మాసబ్ చెరువు పరిరక్షణకు కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చెరువు పరిరక్షణ సమితి సభ్యులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే చెరువు శిఖం భూమి 137 సర్వే నంబర్‌లో అక్రమంగా డంప్ చేసిన మట్టిని తొలగిస్తున్నామని తెలిపారు. వినాయకుడి నిమజ్జనాల సమయంలోని వ్యర్థాలను వెంటనే తొలగించాలని కమిషనర్ అమరేందర్ రెడ్డిని ఆదేశించారు. ఆదివారం చెరువు పరిరక్షణ సమితి సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఎఫ్‌టీఎల్ పరిధి, తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 205లో అక్రమంగా డంప్ చేసిన మట్టిని తొలగించాలని వినతిపత్రం అందజేశారు. శిఖం భూమిలో డంప్ చేసిన మట్టిని తొలగించాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రశ్నించిన వెంటనే ప్రభుత్వం దిగివచ్చి చర్యలు ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు రమేష్, యాదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, వంశీదర్‌రెడ్డి, భాస్కర్, దర్శన్, సునీల్, ఆశీర్వాదం, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



చెక్కును పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణకు సీఎంఆర్ఎఫ్ తోడ్పాటునందిస్తుందని ఆయన అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండాకు చెందిన జటావత్ రవికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.18 వేల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్, మాజీ మార్కెట్ డైరెక్టర్ సుభాష్, మాజీ కౌన్సిలర్ రాములునాయక్, నేతలు సుమన్‌నాయక్, శేఖర్, సతీష్, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన గణేశ్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.50 వేలు మంజూరు కాగా, లబ్ధిదారునికి కాంగ్రెస్ నాయకుడు విజయ్‌రాథోడ్ చెక్కును అందించారు.

అకాల వర్షం.. మిగిల్చిన నష్టం



అన్నబోయిన్‌పల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట



బ్రాహ్మణపల్లిలో పొలంలో రైతు ఆవేదన

- వడగళ్ల వానతో దెబ్బతిన్న మొక్కజొన్న పంట
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

మాడ్గుల: అకాల వర్షం అన్నదాతలను అతలాకుతలం చేస్తోంది. వరుణుడి ప్రతాపం కారణంగా ఆరుగాలం శ్రమించిన రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. మండల పరిధిలోని అన్నబోయిన్‌పల్లి, బ్రాహ్మణపల్లి, అర్కపల్లి, ఇర్విన్ గ్రామాలతో పాటు సమీప తండాల్లో వేసిన మొక్కజొన్న పంట శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు పూర్తిగా దెబ్బతింది. దాదాపు 357 ఎకరాలలో పంటకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ మేరకు ఆమె సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన పంట వివరాలను సేకరించనున్నారు. చేతికి వచ్చిన పంట ఈదురు గాలులతో కురిసిన వర్షానికి దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తమని ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండలంలో భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ వడగళ్లు సైతం పడ్డాయి. దీంతో పలుచోట్ల మామిడి కాయలు రాలిపోయాయి. గంటసేపు ఏకధాటిగా వర్షం కురవడంతో మండలంలో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. మార్కెట్‌లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయింది. మండలంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో పలుచోట్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గ్రామస్తులు అంధకారంలో మగ్గి దోమలతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

సబ్సిడీ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు: మండలంలోని ఎస్టీ, ఎస్సీ సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 50 శాతం సబ్సిడీపై అందించే పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు ఏఓ శ్రీనివాస్‌గౌడ్ ఓ ప్రకటనలో కోరారు. ఎకరా, అర ఎకర భూమి ఉన్న రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి అర్హులని చెప్పారు. బ్యాటరీ ఆపరేటర్ పంపులు, పవర్ స్ప్రేయర్స్, కల్టివేటర్లు, స్ట్రాబేలర్, రోటోవెటర్స్ మంజూరయ్యాయని వివరించారు. వ్యవసాయ పరికరాలు కావాల్సిన రైతులు వెంటనే తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళా రైతులకు..

కడ్తాల్: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఎస్ఎంఏఎం పథకం కింద మండల పరిధిలోని మహిళా రైతులందరికీ 50 శాతం రాయితీపై పరికరాలు అందజేయనున్నట్లు మండల ఏఓ శ్రీలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల పేరు మీద భూమి ఉన్న రైతులే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పథకంలో ట్రాక్టర్‌తో పాటు, ఇతర యాంత్రీకరణ పనిముట్లు అందించనున్నట్లు తెలిపారు. సంబంధిత మహిళా రైతులు దరఖాస్తు పత్రంతో పాటు, పాస్ పుస్తకం, ఆధార్‌కార్డ్ తదితర జిరాక్స్ పత్రాలతో వ్యవసాయ కార్యాలయంలో అర్జీ చేసుకోవాలని కోరారు. ఎస్టీ, ఎస్సీ రైతులకు సైతం వర్తిస్తుందని తెలిపారు.

మహనీయుల జీవితం స్ఫూర్తిదాయకం

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య
- ఘనంగా షహీద్ దివస్



మంచాల: సీపీఎం ఆధ్వర్యంలో షహీద్ దివస్

తుర్కయంజాల్: మహనీయుల జీవితం దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, వారి త్యాగాలను నేటి సమాజానికి తెలియజేయాల్సిన బాధ్యత పాలకులదేనని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని(షహీద్ దివస్) పురస్కరించుకుని తుర్కయంజాల్‌లో వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. భారత స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత దర్శన్, బీఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేశ్‌కుమ, నాయకులు శ్రీకాంత్, శివ, వివేక్‌రెడ్డి, కృష్ణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

మంచాల: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప యోధుడు భగత్‌సింగ్ అని నేతలు కొనియాడారు. ఆదివారం ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్, సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, అశోక్, వెంకటేష్, రమేష్, రమణారెడ్డి, సురేష్, కృష్ణ, గాలిబ్, గణేష్, బుగ్గరాములు, గోపాల్, రాములు, తరంగ్, మల్లేష్, విజయ్, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద అఖిలపక్షం నాయకులు

మాల్‌లో..

యాచారం: మండల పరిధిలోని మాల్ వ్యాపార కేంద్రంలో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప నేత భగత్‌సింగ్ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చందునాయక్, తావునాయక్, సత్యనారాయణ, ఐలయ్య, శ్రీశైలం, ఆంజనేయులు, బుగ్గరాములు, జంగారెడ్డి పాల్గొన్నారు.



యాచారం: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు